పల్లె వెలుగు బస్సులు ఎక్కడ ?

- ఇప్పటికీ గ్రామాల్లో తిరగని సర్వీసులు
- ఉదయం, సాయంత్రం బడి పిల్లల బస్సులే జనానికి దిక్కు
- ఉచిత బస్సు పథకంతో ఒరిగిందేమీ లేదంటున్న గ్రామీణులు


ముచ్చింతాల నుంచి పల్లె వెలుగు బడి బస్సు


పెనుగంచిప్రోలు సెంటర్‌లో జగ్గయ్యపేట వెళ్లే ఆటోలు

పెనుగంచిప్రోలు:ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నా తమకు ఒరిగిందేమీ లేదని అంటున్నారు గ్రామీణ ప్రజలు. పల్లె వెలుగు పేరుతో తిప్పుతున్న బస్సులు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ప్రధానంగా జగ్గయ్యపేట నుంచి వయా పెనుగంచిప్రోలు మీదుగా విజయవాడకు మాత్రమే బస్సులు అధికంగా తిరుగున్నాయి. మిగిలిన గ్రామాలకు ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బడి బస్సులే దిక్కు అవుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు.

గ్రామాలకు వెళ్తున్న బడి బస్సులు...

మండలంలోని లింగగూడెం గ్రామానికి అసలు బస్సు సర్వీసు లేదు. ప్రయాణికులు పెనుగంచిప్రోలు లేదా గౌరవరం వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉంది. పెనుగంచిప్రోలు నుంచి సుబ్బాయిగూడెం కొళ్లికూళ్ల, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామాలకు కలిపి నందిగామ వరకు ఉదయం, సాయంత్రం ఒక ట్రిప్పు మాత్రమే బడి బస్సు ఉంది. అలాగే జగ్గయ్యపేట నుంచి అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, జొన్నలగడ్డ మీదుగా నందిగామకు, శివాపురం నుంచి జగ్గయ్యపేటకు, ముచ్చింతాల నుంచి ఉదయం, సాయంత్రం ఒక ట్రిప్పు బడి బస్సు తిరుగుతుంది. జగ్గయ్యపేట నుంచి వయా వేదాద్రి బండిపాలెం, కొణకంచి మీదుగా విజయవాడకు ఉదయం, విజయవాడ నుంచి సాయంత్రం వయా కొణకంచి మీదుగా జగ్గయ్యపేటకు, మధ్యాహ్నం ఒక ట్రిప్పు విజయవాడ నుంచి కొణకంచి మీదుగా బస్సులు నడుస్తున్నాయి. కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సులు నడుస్తుండటంతో మిగిలిన సమయాల్లో ప్రజలు ఆటోలు, ఇతర వాహనాలు ఆశ్రయించక తప్పటం లేదు.

ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీస్ లేదు...

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలుకు నిత్యం భక్తులు వస్తుంటారు. అయినా జగ్గయ్యపేట డిపో నుంచి ఒక్క ఎక్స్‌ప్రెస్ సర్వీస్ కూడా పెనుగంచిప్రోలు మీదుగా లేదు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుంచి వయా పెనుగంచిప్రోలు మీదుగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాత్రం నడుపుతూ ఆదాయం ఆర్జిస్తున్నారు. జగ్గయ్యపేట డిపో నుంచి వయా పెనుగంచిప్రోలు మీదుగా పల్లెవెలుగు బస్సులు మాత్రం రోజుకు 11 బస్సులు 29 ట్రిప్పులు తిప్పుతున్నారు. గతంలో జగ్గయ్యపేట–పెనుగంచిప్రోలు షటిల్ సర్వీసులు రెగ్యులర్‌గా ఉండేవి. అవి తీసేయటంతో కేవలం ఆటోలు మీదే ప్రయాణికులు ఆధారపడుతున్నారు. దీంతో ఉచిత బస్సులు తమకు ఉపయోగపడటం లేదని, బస్సులు సంఖ్య పెంచాలని ప్రజలు అంటున్నారు.

బడి బస్సే ఉంది



మా గ్రామం నుంచి ఉదయం, సాయంత్ర బడి బస్సు పాఠశాల, కళాశాల విద్యార్థులకు మాత్రమే ఉంది. మిగిలిన సమయంలో ఒక్క బస్సు రాదు. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఉచిత బస్సు వినియోగించుకోవాలంటే బస్సులు పెంచాలి.

–నక్కా కమల, గుమ్మడిదుర్రు

షటిల్ సర్వీసులు నడపాలి



గతంలో పెనుగంచిప్రోలు–జగ్గయ్యపేట మధ్య షటిల్ సర్వీసులు నడిచేవి, ఇప్పుడు బస్సులు లేకపోవటంతో ఆటోలతో పాటు ఇతర వాహనాలు ఎక్కక తప్పటం లేదు. అలాగే జగ్గయ్యపేట డిపో నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేయాలి.

–చేని కుమారి, పెనుగంచిప్రోలు

క్లుప్తంగా

ఆటోనగర్‌లో తనిఖీలు



జగ్గయ్యపేట:పట్టణ సమీపంలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కులోని పలు కెమికల్ కర్మాగారాలను బుధవారం విజయవాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలు కర్మాగారాలలో క్షేత్ర స్థాయిలో పాటిస్తున్న నిబంధనలు, తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని కర్మాగారాల్లో నీటిని పరీక్షించేందుకు శాంపిల్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పొల్యూషన్ నియంత్రణ చర్యలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు టాస్క్‌ఫోర్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి



నందిగామ రూరల్:విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో పద్మ తెలిపారు. మండలంలోని చందాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

సత్యనారాయణపురంలో ఎమ్మెల్యే పర్యటన



జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని 27 వ వార్డు సత్యనారాయణపురంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బుధవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి పర్యటించారు. పలు వీధుల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోరు పంపు కావాలని అడగడంతో వారం రోజుల్లో వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేకపోతే కేసులు



జగ్గయ్యపేట అర్బన్:ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ వాడాలని, అలాగే బైక్‌లపై ట్రిబుల్ రైడింగ్ చేసినా చర్యలు తప్పవని సీఐ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేశారు. విద్యార్థులకు హెల్మెట్, ట్రిబుల్ రైడింగ్ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

24న శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన, వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రకారుల రాష్ట్ర స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు. 24న ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని ప్రముఖ చిత్రకారులు 48 మంది శ్రమైక జీవనంపై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వ విద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మృత్యుంజయరావు, సంప్రదాయ చిత్రకళ అధ్యాపకుడు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారుడు వై.శేషబ్రహ్మం, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.

డీజేలు ఏర్పాటు చేస్తే అనుమతులు తప్పనిసరి

కంచికచర్ల: వినాయకచవితి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసే సమయంలో డీజేలు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. విలేకర్లతో బుధవారం ఆయన మాట్లాడుతూ పందిళ్లు, మండపాలు సొంత ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఇసుక, వాటర్ డ్రమ్ములు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముందుగా విగ్రహాలను ఏయే ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నారో తమకు తెలియజేయాలని కోరారు. పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేవారు సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండాలని చెప్పారు. ఏయే రోజుల్లో నిమజ్జనం చేస్తున్నారో కూడా తమకు తెలియజేయాలని చెప్పారు.

250 మందికి వైద్య పరీక్షలు

నందిగామ రూరల్:మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో అమరావతి కంటి ఆస్పత్రి, పనమ నాలజీ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కాగా వీరిలో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 40 మందికి కంటి శుక్లాల శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం అవసరమున్న వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉష, సంధ్య, సురేష్, అనూష, గ్రామ నాయకులు అబ్బూరి నాగమణి, తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, చెరుకూరు హైమారావు, కొత్తపల్లి శ్రీరాంబ్రహ్మం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లపై కూటమి సర్కారు కక్ష

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు


మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పాల్గొన్న పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్:కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కోతలకు సిద్ధమై సామాజిక పింఛన్ లబ్ధిదారుల జాబితా నుంచి ఏరివేత పేరుతో అర్హులను తొలగించడం దారుణం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పూర్ణకంటి బాబురావుతో కలిసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి హామీలను గుప్పించారని తెలిపారు. దివ్యాంగుల పింఛను రూ.6 వేలకు, ఇంట్లో మంచం మీద ఉన్నవారికి రూ.15 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు అంటూ మోసపూరిత వాగ్దానాలు చేశారన్నారు. ఏరివేతలో భాగంగా పరీక్షలు నిర్వహించి వైకల్యం శాతం తగ్గించి నోటీసులు ఇవ్వడంతో లబ్ధిదారుల్లో గుబులు మొదలైందని చెప్పారు. వచ్చే నెల నుంచి పింఛను రాదని తెలుసుకొని లబోదిబోమంటున్నారని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో 2024 ఎన్నికల ముందు నాటికి 66.34 లక్షల మందికి పైగా పింఛన్లు పారదర్శకంగా అందించామని వెల్లడించారు. కూటమి సర్కారు ఇప్పుడు వీటిని కేవలం 62.19 లక్షలకే పరిమితం చేసిందని వివరించారు. అంటే 4 లక్షల పింఛన్లు తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్లు తొలగింపుతో ఎంతో మంది ఆవేదన చెందుతున్నారని వాపోయారు.

జగ్గయ్యపేటలో పార్టీ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు.......

జగ్గయ్యపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరికైతే అర్హత ఉండి పింఛన్లు ఆగిపోయాయో వారి కోసం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం తరపున కాల్ సెంటర్ ఏర్పాటుచేశామని తెలిపారు. బాధితులు తమ వివరాలు 9581646430 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే అధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సంబూరి రవి, ఇంకా పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణానదికి తగ్గని వరద..

భయాందోళనలో పరివాహక గ్రామాల ప్రజలు


ముక్త్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ


రావిరాలలో కోతకు గురైన ఒడ్డు

జగ్గయ్యపేట:గత మూడు రోజులుగా మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో బుధవారం కూడా కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుంది. పులిచింతల నుంచి ఏడు గేట్‌ల ద్వారా ఐదు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో మండలంలోని నదీ పరివాహక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో కృష్ణమ్మ ఉగ్రరూపం చూపుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని మత్స్యకారులు పడవలను సురక్షిత ప్రాంతంలో భద్రపరిచారు. రావిరాలలోని పాలేరు, కృష్ణమ్మ సంగమం కోతకు గురవుతుండటంతో సమీప నివాస ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్‌లు గ్రామంలో పర్యటించి 100 మందిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సర్వే నిర్వహించారు. ప్రవాహం క్రమక్రమంగా తగ్గే అవకాశం ఉందని ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని అధికారులు కోరారు. ఈ గ్రామాల్లోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

కంచికచర్ల: ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని లేకపోతే దోమలకు ఆవాసకేంద్రాలుగా ఏర్పడతాయని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.మధురిమ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేశారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ దోమలు కుట్టటం వల్లే మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో, తొట్లు, పాత టైర్లలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డ్రైయినేజీల్లో మురుగునీరు పారుదల అయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. జ్వరాలబారిన పడిన రోగులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు ఉచితంగా పొందాలని తెలిపారు. ఎం.శ్రీనివాసరావు, జీవీ రాఘవేంద్రరావు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంట్లో చోరీ

నందిగామ రూరల్:తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని దాములూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ గాదెల రామారావు కొంత కాలంగా నందిగామ పట్టణంలో నివాసముంటూ ప్రతిరోజూ గ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని ఇంటికి వచ్చిన ఆయన తలుపులు పగలగొట్టి ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అదే విధంగా క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్స్ బృంద సభ్యులు ఆధారాలను సేకరిస్తున్నారు. కాగా డబ్బు, బంగారం చోరీకి గురికాలేదని చిన్నపాటి గృహోపకరణ వస్తువులను అపహరించినట్లు విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. సర్పంచ్ రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వైవిఎల్ నాయుడు చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నందిగామ రూరల్:పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నిరంతర కృషి చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు జ్యోతిబసు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుప్రజ తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నందిగామ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనంగా రూ. 26వేలు అందించాలని కోరారు. అంతే కాకుండా కార్మికులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా కార్మికులకు యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, రెయిన్‌కోట్ అందించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ నూతన కమిటీ ఎన్నిక..

మహాసభ అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా దసవరపు సైదా, కార్యదర్శిగా సలికేటి నరేష్, గౌరవాధ్యక్షుడిగా కటారపు గోపాల్, కోశాధికారిగా కోండ్రు రాజారావు, ఉపాధ్యక్షుడిగా పుట్టా మాణిక్యం, సభ్యులుగా చంద్ర, రుత్తమ్మ, బేబి, నాగరాజు, ప్రసాద్, నతానియేలును ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ పోస్టరు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నందిగామ రూరల్:విద్యా, వసతి దీవెన నిధులు విడుదల చేయటంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపీ నాయక్ తెలిపారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 25న చేపట్టిన చలో కలెక్టరేట్ పోస్టర్‌లను స్థానిక కేవీఆర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ విద్యా, వసతి దీవెన నిధులు రూ. 6,400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిధులు విడుదల కాకపోవటంతో చదువులు పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్‌లు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు యూనివర్శిటీల పరిధిలో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని చెబుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్, మహేష్, మురళి, మనోజ్‌కుమార్, నరసింహ, రాంబాబు, పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

వీరులపాడు:మండలంలోని ఆయా గ్రామాల వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రవికుమార్ ఆదేశించారు. జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నదీ పరివాహక గ్రామాల అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇవ్వాలి


తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్:ఈ నెల 27 వ తేదీ నుంచి గణేష్ నవరాత్రులు ప్రారంభమవుతున్న సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాట్లకు కావాల్సిన అన్ని అనుమతులను సింగిల్ విండో పద్ధతిలో ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా భక్తులకు అందజేయాలని జగ్గయ్యపేట గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు అధికారులను కలిసి విన్నవించారు. నిమజ్జన సమయంలో అహేతకమైన డీజే సౌండ్ సిస్టం పాటల ద్వారా అవాంఛిత, అసభ్య నృత్యాలు, మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొనడం వంటి అనైతిక చర్యలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ప్రఫుల్ల శ్రీకాంత్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాసరావు, రాజా, సురేష్, తిరుపతిరావు, భాస్కర్, జొన్నలగడ్డ షణ్ముక్, గోపి, త్రికేష్, కీసర గోపి తదితరులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ జి.రాజును కలిసి విన్నవించారు.

ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం


ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య

నందిగామ టౌన్:రైతు శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆధునిక, సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నాణ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకురావటంతో పాటు ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించటంలో ఎరువుల విక్రయ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి



నందిగామ టౌన్:సహకార సంఘాల ద్వారా మంజూరు చేస్తున్న అన్ని రకాల రుణలలో జాప్యం లేకుండా రైతులకు సకాలంలో అందించాలని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు. డీసీసీసీ కార్యాలయంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన కేడీసీసీ పరిధిలోని ఏడు బ్రాంచ్‌ల మేనేజర్‌లు, ఫీల్డ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాల మంజూరులో వాణిజ్య బ్యాంకులకన్నా ముందంజలో ఉన్నప్పటికీ మరింత వేగవంతమైన సేవలు అందించాలని చెప్పారు. అంతే కాకుండా వ్యవసాయేతర రుణాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్యామ్ మనోహర్, జీఎం రంగబాబు, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం శ్రీదేవి, మేనేజర్‌లు, తదితరులు పాల్గొన్నారు.